సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 8 । జనవరి । 2023



వాహన తనిఖీ స్పెషల్‌డ్రైవ్

బోయినపల్లి(వేములవాడ): మండలవ్యాప్తంగా శనివారం పోలీసులు వాహన తనిఖీల స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. పత్రాలు సరిగ్గా లేని 12 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై అభిలాశ్ తెలిపారు.



చెత్తబుట్టల పంపిణీ

వేములవాడ: స్వచ్ఛ వేములవాడ సాధనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ కోరారు. 27వ వార్డులో చెత్తబుట్టలు పంపిణీ చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /11.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బందనకల్ బడికి నీటివసతి



పైపులైన్ వేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ముస్తాబాద్(సిరిసిల్ల): బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు పంచాయతీ పాలకవర్గం నీటి వసతి కల్పించింది. ఈనెల 5న సాక్షిలో 'బందనకల్ బడిలో నీటి గోస' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ, పంచాయతీ పాలకవర్గం స్పందించింది. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణకు, మూత్రశాలలు, మరుగుదొడ్లకు నిలిచిపోయిన నీటి సరఫరాను పునరుద్ధరించింది. సర్పంచ్ వెంకటేశ్వరి, ఉపసర్పంచ్ కార్తీక్‌రెడ్డి బోరుమోటార్‌ను మరమ్మతు చేయించారు. పంచాయతీ కార్యదర్శి రాజు, సిబ్బంది పనులు చేపట్టారు.

డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల బీకాం పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. విప్రోలో ఉదయ్, కాన్సెంట్రిక్స్ మల్టీనేషనల్ కంపెనీలో నరేశ్ ఉద్యోగాలు సాధించారు. వీరిని కాలేజీ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీవల్లి, అధ్యాపకులు కృష్ణమూర్తి, కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మనోహర్ అభినందించారు.

జిల్లాస్థాయికి ఎంపిక



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీఈవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించగా నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. గురుకుల పాఠశాలకు చెందిన పవిత్ర, తిమ్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని వైష్ణవి, వెంకటాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని శ్రీనిధి, బొప్పాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని రిషిత జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వీరిని డీఈవో రాధాకిషన్ అభినందించారు. ఎంఈవో రఘుపతి, ఈఎల్‌టీపీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యుడు, మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ముప్పై పడకల ఆసుపత్రి ఏమైంది?

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో ముప్పై పడకల ఆస్పత్రి మంజూరు చేస్తామన్న మంత్రి కేటీఆర్ హామీ ఏమైందంటూ కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన చేపట్టారు. రాజీవ్‌చౌక్‌లో చెవిలో పూలతో నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఒరగంటి తిరుపతి, దీటి నర్సింలు, రాజేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నరేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వస్త్రోత్పత్తికి కూలి పెంచాలి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ వస్త్రాలకు సంబంధించిన నేతకార్మికుల కూలిని వెంటనే పెంచాలని పవర్‌లూమ్ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ కోరారు. సిరిసిల్లలోని సీపీఎం ఆఫీసులో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సిరిసిల్లలో తయారయ్యే బతుకమ్మ చీరల ఉత్పత్తి కూలి ప్రభుత్వం ప్రకటిస్తుందని, మిగతా ఆర్డర్ల కూలి ప్రకటించకపోవడంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. మీటరుకు రూ.3.25 ఇవ్వాలని, లేకుంటే సోమవారం నుంచి విధులు బహిష్కరిస్తారని హెచ్చరించారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ కోరారు. సిరిసిల్లలోని వెంకంపేట జెడ్పీ స్కూల్‌లో సభ్యత్వ నమోదుచేశారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్న తులు చేపట్టాలని కోరారు. లక్ష్మీనారాయణ, మల్లేశం, రాంగోపాల్‌గౌడ్, గణేష్ తదితరులు ఉన్నారు.

Sunday Special

వాయుపుత్ర.. వాహన మిత్ర..!



కొండగట్టు ఆంజనేయస్వామి

- వజ్రకాయుడి చెంత వాహన పూజలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొండగట్టు, గట్టుదుద్దెనపల్లి, అగ్రహారం ప్రసిద్ధి
- ఈ మూడూ ఆంజనేయుడి కోవెలలే..
- దళితబంధు వాహనాలతో ఆలయాల్లో నిత్యం రద్దీ
- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక



గట్టుదుద్దెనపల్లి ఆలయంలో ట్రాక్టర్‌కు పూజలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆంజనేయుడు అంటేనే అభయం. వజ్రకాయుడి పేరు పలికితే తెలియని మనోబలం. ధైర్యానికి, స్థైర్యానికి, విశ్వాసానికి మారుపేరు హనుమంతుడు. ఉమ్మడి జిల్లాలో కొండగట్టుపై వెలసిన పవనసుతుడి గొప్పతనం తెలియనివారుండరు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఉమ్మడి జిల్లావాసులకు దాదాపు కులదైవం. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి నుంచి ప్రతీ ఇంట ఆంజనేయుడి పేరును ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పెట్టుకుంటారంటే అతిశయోక్తి కాదు. ఏ వాహనం కొన్నా మారుతి పాదాల చెంత తొలిపూజ చేసిన తరువాతే రంగంలోకి దింపుతారు. ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు ఆ తరువాత మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి, వేములవాడ మండలం అగ్రహారంలోని అంజన్న ఆలయాలు వాహనపూజలకు ప్రసిద్ధి చెందినవి. ఆయా ఆలయాల విశిష్టతపై సండే స్పెషల్..

చిన్న కొండగట్టు గట్టుదుద్దెనపల్లి

చిన్నకొండగట్టుగా పేరొందిన మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి ఆంజనేయస్వామి ఆలయం కూడా రోజురోజుకి ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. గట్టుదుద్దెనపల్లిలో ఆంజనేయుడి ప్రాచీన విగ్రహాన్ని పెద్ద బండరాయిపై చెక్కారు. అది కాలావధులపై సమాచారం లేదు. 1982 నుంచి గ్రామస్తులు ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం సగటున రోజుకు 200కుపైగా వాహనాలు ఇక్కడ పూజలు అందుకుంటాయి. దళితబంధులో మంజూరైన 1,285 వాహనాలకు ఇక్కడే పూజలు చేయించారు.



కొండగట్టులో వాహన పూజలు

700 ఏళ్ల చరిత్ర..

కొండగట్టు దేశంలోని అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటి. ఇక్కడి స్వామివారిని దాదాపుగా 700 ఏళ్లుగా కొలుస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయి. కొండగట్టు మీద వాహన పూజల సంప్రదాయం అనాదిగా వస్తోంది. ఒకప్పుడు రాజులు, సంస్థానాధీశులు, జమీందారుల రథాలు, రైతుల ఎండ్లబండ్లకు పూజలు జరిగేవి. ప్రస్తుతం కొండగట్టుకుపై నెలకు 5000 కుపైగా వాహనాలు పూజకు వస్తాయి. సగటున రోజుకు 170 వాహనాలు ఇక్కడ పూజలందుకుంటాయి. మన రాష్ట్రమే కాదు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తమ కొత్త వాహనాలకు పూజలు చేయిస్తుంటారు.

అగ్రహారంలో..

వేములవాడ మండలంలోని అగ్రహారం శ్రీ జోడాంజనేయస్వామి ఆలయంలోనూ వాహనపూజలు చేస్తుంటారు. మంగళవారం, శనివారం నాడు ఎక్కువ సంఖ్యలో వాహనపూజలు నిర్వహిస్తారు. మిగితా రోజుల్లోనూ పదులసంఖ్యలో వస్తుంటాయి.

దసరాకు రద్దీగా..

ఈ మూడు ఆలయాల్లోనూ దసరా రోజు పూజ చేయించేందుకు వేలాది వాహనాలు వరుస కడతాయి. దసరారోజు ఈ ఆలయాల వద్ద పూజలు చేయిస్తే.. మంచి జరుగుతుందన్న విశ్వాసంతో ఆ రోజున పాత వాహనాలకు సైతం ఇక్కడ పూజలు చేయడం గమనార్హం. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు, సివిల్ పనులు చేసే కాంట్రాక్టర్లు తమ వాహనాలను కొండగట్టుకు తీసుకువస్తుంటారు.

దళితబంధుతో తాకిడి

హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకం ద్వారా 8,851 మంది లబ్ధిదారులకు వాహనాలు అందజేశారు. ఇందులో జేసీబీలు, ట్రాక్టర్లు, ట్రక్కులు, లారీలు, ఆటోలు, ట్రాలీలు ఉన్నాయి. వాహనమేదైనా బాహుబలి వద్ద పూజ చేయించకుండా బయటికి తీసేదే ఉండదంటే అతిశయోక్తి కాదు. దళితబంధులో ఇచ్చిన వాహనాల్లో హుజూరాబాద్ మాత్రమే కాకుండా.. ఉమ్మడి జిల్లా, పొరుగున ఉన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి కూడా కొండగట్టు, గట్టుదుద్దెనపల్లి, అగ్రహారానికి తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తున్నారు.



పవన్ వారాహి

కేసీఆర్, పవన్ నోట కొండగట్టు

గతేడాది డిసెంబరు 7వ తేదీన జగిత్యాలలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రకటించి తన భక్తిని చాటుకున్నారు. అదే నెలలో జనసేన పార్టీ అధినేత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ ఎన్నికల రథం వారాహికి జనవరి నెలాఖరున పూజలు చేస్తానని ప్రకటించడంతో మరోసారి కొండగట్టు పేరు మీడియాలో పతాక శీర్షికలకు ఎక్కింది. ప్రతీవారం మంత్రులు, ప్రముఖులు, ఎమ్మెల్యేలు, సాధారణ భక్తుల తాకిడితో పుణ్యక్షేత్రం కిటకిటలాడుతోంది.

భూసమస్యలకు సత్వరమే పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషన్ కలెక్టర్ ఖీమ్యానాయక్

- కలెక్టర్ అనరాగ్ జయంతి
- నారాయణపూర్‌లో రెవెన్యూ సదస్సు
- హాజరైన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామంలో నెలకొన్న భూ, రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సు ప్రారంభించామని కలెక్టర్ అనరాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు హాజరై గ్రామస్తులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపారు. అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ, భూ సమస్యలను పరిష్కరించడానికి గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సదస్సులో 52 దరఖాస్తులు స్వీకరించారు. అక్కడికక్కడే 16 దరఖాస్తులను పరిశీలించి సంబంధిత పేపర్‌లను వారికి అందించారు. మిగతా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. తడి, పొడి చెత్తను పరిశీలించి పలు వివరాలను కార్యదర్శి భరత్‌ను అడిగి తెలుకున్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మన ఊరు – మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మితో మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలని, ఇంకుడుగుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, సర్పంచ్ నిమ్మ లక్ష్మినారాయణరెడ్డి, ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ అహెరా సుల్తానా, కార్యదర్శి భరత్, కారోబార్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మనుమరాలికి న్యాయం చేయండి సారూ



మాట్లాడుతున్న ఆర్డీవో పవన్‌కుమార్

గ్రామానికి చెందిన శివరాత్రి కొమురవ్వ కూతురు కరోనాతో మరణించింది. దీంతో కూతురు, కుమారుడు అనాథలుకాగా.. తమకు న్యాయం చేయాలని డిప్యూటీ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు దరఖాస్తు అందించింది. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, కరోనాతో మరణించినందున డబ్బులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి మార్గం

వేములవాడరూరల్: ఏళ్లుగా పేరుకుపోయిన భూసమస్యలను పరిష్కరించేందుకే గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చారని వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీవో పవన్‌కుమార్ మాట్లాడుతూ చిన్నపాటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూసమస్యలపై దరఖాస్తులు అందజేశారు. తహసీల్దార్ నక్క శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ లీల, సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గొస్కుల రవి, ఆర్ఐ అజ్మత్, అర్జున్ పాల్గొన్నారు.

10న బీఆర్‌ఎస్ బహిరంగ సభ

- 'సెస్' పాలకవర్గానికి ఆత్మీయ సన్మానం
- 10 వేల మందితో భారీ సభకు ఏర్పాట్లు..
- హాజరవుతున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి



సిరిసిల్ల బైపాస్ రోడ్డులో సిద్ధమవుతున్న గ్రౌండ్

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 10న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) పాలకవర్గం ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఎన్నికైన 'సెస్' చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లకు ఆత్మీయ సన్మానం చేయాలని నిర్ణయించారు. ఈమేరకు పది వేల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులను ఈ సమావేశానికి తరలించాలని భావిస్తున్నారు. టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారిన తరువాత జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ కావడంతో భోజన వసతులు కల్పించి పార్టీ శ్రేణులను ఉత్సాహ పరచాలని భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు బీఆర్‌ఎస్ నాయకత్వం సంకేతాలిచ్చింది. ఈమేరకు సిరిసిల్లలోని మొదటి బైపాస్ రోడ్డులో సభ నిర్వహణకు గ్రౌండ్‌ను మొరం పోసి సిద్ధం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సభకు రాష్ట్ర మంత్రులు

సిరిసిల్లలో మంగళవారం నిర్వహించే బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు కె.తారక రామారావు, జగదీశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి వస్తారని భావిస్తున్నారు. వీరితోపాటు ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యేలు రమేశ్‌బాబు, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ కె.రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్.అరుణ, స్థానిక నాయకులు ఈ సభలో పాల్గొననున్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడొద్దు



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

సిరిసిల్లటౌన్: నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడొద్దని యువజన ప్రజాసంఘాల ప్రతినిధులు కోరారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. 1600 మీటర్లు రన్నింగ్ చేసిన అభ్యర్థులకు సివిల్ కమ్యూనికేషనల్ ఫైర్ మాస్ మెయిన్స్ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. నాయకులు మల్లారపు అరుణ్, గాంతుల మహేశ్, మంద అనిల్, ఎరవెల్లి నాగరాజు, అంగూరి రంజిత్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



హాజరైన పార్టీ నాయకులు



మాట్లాడుతున్న రాణిరుద్రమ

- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ

సిరిసిల్లఅర్బన్: రాబోయే ఎన్నికల్లో సిరిసిల్లలో మంత్రి కేటీఆర్‌ని ఓడించి బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల అసెంబ్లీ పాలక్ రాణిరుద్రమ ధీమా వ్యక్తం చేశారు. పెద్దూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనంలో పాల్గొన్నారు. మొదటగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రసంగాలను స్క్రీన్‌పై తిలకించారు. అనంతరం రాణిరుద్రమ మాట్లాడారు. ఒక్కో కార్యకర్త వంద మందితో సమానమన్నారు. సెస్ ఎన్నికల్లో నైతిక విజయం బీజేపీదేనేని, అధికార పార్టీ బ్యాలెట్ బాక్సులను మార్చి అవినీతితో గెలిచిందని ఆగ్రహం వ్యక్త చేశారు. పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, పార్లమెంట్ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, పట్టణాధ్యక్షుడు అన్నల్‌దాస్ వేణు, నాయకులు శీలం రాజు, నాగుల శ్రీనివాస్, కమలాకర్‌రావు, బొల్గం నాగరాజ్‌గౌడ్, ప్రభాకర్, గజభీంకార్ చందు పాల్గొన్నారు.

వేములవాడ నియోజకవర్గ నాయకులతో..

వేములవాడ: బీజేపీ బూత్‌కమిటీలతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. స్థానిక భీమేశ్వరగార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలువురు నాయకులు హాజరయ్యారు. నడ్డా, బండి సంజయ్ ప్రసంగాలను విన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, అసెంబ్లీ పాలక్ నందీశ్వర్‌గౌడ్, అసెంబ్లీ ప్రభారీ మీసాల చంద్రయ్య, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, ఎంపీపీ బండ మల్లేశం, జిల్లా అధికార ప్రతినిధులు గోపు బాలరాజు, ముప్పిడి శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చార్జిషీట్లు త్వరగా వేయండి



వేములవాడలో పోలీసు అధికారులతో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజిరెడ్డి, విక్రాంత్

వేములవాడ: నేరాలను రుజువు చేసేందుకు చార్జిషీట్లు త్వరగా దాఖలు చేయాలని వేములవాడ సబ్‌కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరి రాజిరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ పోలీసు అధికారులకు సూచించారు. స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన పీపీల సమావేశంలో మాట్లాడారు. డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, కిరణ్‌కుమార్, ఎస్సైలు నాగరాజు, అభిలాశ్, రమేశ్, ప్రభాకర్, రమాకాంత్, తిరుపతిరెడ్డి, వెంకట్రాజం పాల్గొన్నారు.


శిక్షల శాతం పెరగాలి

సిరిసిల్లక్రైం: నిందితులకు శిక్షలు పడేలా కృషిచేయాలని పోలీసు, న్యాయ అధికారులు కోరారు. సిరిసిల్ల కోర్టు పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నమోదైన కేసులకు సంబంధించి కోర్టు విధివిధానాల గురించి పోలీస్ అధికారులతో చర్చించారు. ఏఎస్పీ చంద్రయ్య, అడిషనల్ పీపీలు లక్ష్మీప్రసాద్, నర్సింగరావు, ఏపీపీలు సందీప్, డీసీఆర్బీ డీఎస్పీ బాలకిషన్, సీఐ అనిల్‌కుమార్, మొగిలి, ఉపేందర్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మొబైల్ వెటర్నరీ సర్వీస్‌లో ఉద్యోగాలు

సిరిసిల్లటౌన్: సంచార వైద్యశాల వాహనాలలో డాక్టర్, పారావిట్‌గా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 1962 జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సలీం శనివారం ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఉద్యోగానికి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ ఇన్ ఎనిమల్ హాస్బెండరీ ఉత్తీర్ణులై ఉండాలని, రిటైర్డ్ వైద్యులు కూడా అర్హులని పేర్కొన్నారు. పారావిట్ ఉద్యోగాలకు డిప్లొమా ఇన్ వెటర్నరీ సైన్స్, ఎనిమల్ హాస్బెండరీ సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడైన పనిచేయుటకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గుండ్ల పోచంపల్లి, మేడ్చల్ రోడ్ మల్కాజిగిరి జిల్లా హైదరాబాద్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 79950 61581లో సంప్రదించవచ్చు.

సైజింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



గాంధీచౌక్‌లో సైజింగ్ కార్మికులు

సిరిసిల్లటౌన్: పక్షం రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్న అధికారులు, యజమానుల వైఖరిని నిరసిస్తూ సైజింగ్ కార్మికులు శనివారం సిరిసిల్ల గాంధీచౌక్‌లో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కార్మికుల సమస్యలు, కూలి పెంపు తదితర అంశాలపై జిల్లా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. సైజింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వొల్లాల కిశోర్, సోమిశెట్టి దశరథం, శ్రీనివాస్, శ్రీధర్, తిరుపతి, సమ్మయ్య, రమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో ఇనుమడుగు పీఠాధిపతి



శ్రీహరిస్వామిజీకి ప్రసాదం అందజేస్తున్న భీమాశంకరశర్మ

వేములవాడ: ఇనుమడుగు పీఠాధిపతి శ్రీశ్రీ శ్రీహరిస్వామిజీ శనివారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం వారికి ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అద్దాల మంటపంలో వేదమంత్రాలతో ఆశీర్వచనం గావించారు. వారి వెంట పర్యవేక్షకులు అల్లి శంకర్, శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియా

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో శుక్రవారం మృతిచెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రడం పరుశరాం కుటుంబానికి రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని కార్మికసంఘం నాయకులు, కార్మికులు పరుశరాం మృతదేహంతో కంపెనీ గేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాదాపు 12గంటల ఆందోళన అనంతరం కార్మికసంఘం నాయకులు, కంపెనీ అధికారులకు మధ్య జరిగిన చర్చల్లో రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు దహనసంస్కారాల ఖర్చులకు రూ.25వేలు, కుటుంబంలో ఒకరికి స్కిల్డ్ ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకారం కుదరడంతో ఆందోళన విరమించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్, పెద్దపల్లి ఎస్సైలు శ్రీనివాస్, రాజేశ్, సహదేవ్‌సింగ్‌తో పాటు పోలీస్‌సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పడకేసిన గోదావరి పర్యాటకం



గోదావరినదిలో రెగెట్టా పోటీలు (ఫైల్)



తుమ్మపొదల్లో ఉన్న ఏసీ బోట్

- తుమ్మ పొదల్లోనే ఏసీ బోట్
- ప్రతిపాదనలకే పరిమితమైన హరిత హోటల్

గోదావరిఖని(రామగుండం): గోదావరి పర్యాటకం పడకేసింది. మరో నెలరోజుల్లో ఏసీ బోట్ ప్రారంభిద్దాం అనే సమయంలోనే భారీ వర్షాలకు పడవ కొట్టుకుపోయి తుమ్మల్లో చిక్కుకుంది. రెండేళ్లు దాటినా పర్యాటకానికి మోక్షం లేకుండా పోయింది. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరి తీరంలో పర్యాటకం కావాలని అధికారులను కలిసి కోరడంతో దానికి మంజూరు చేయించారు. కానీ అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు. గత నెల సింగరేణి పర్యాటకం ప్రారంభమైంది కానీ గోదావరి పర్యాటకం కలగానే మిగిలింది.

కాళేశ్వరం ఏర్పాటుతో..

కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో ఏడాది పొడవునా గోదావరినది నీటితో కళకళలాడుతోంది. నది తీరం మరో కోనసీమగా మారుతోందని ఈప్రాంత ప్రజలు ఆశపడ్డారు. తీరంలో సమ్మక్క- సారలమ్మ గద్దెలు, స్నానాలకు వీలుగా పుష్కరఘాట్, పర్యాటకులకు ఆసక్తి గొలిపే రెగెట్టా పోటీలు, రెండు బ్రిడ్జిలపై నిల్చుని పోటీలను వీక్షించేందుకు పర్యాటకులకు అనుకూలంగా ఉన్నాయి. గోదావరి అందాలను వీక్షించేందుకు వీకెండ్‌లో పడవ ప్రయాణం కోసం రూ.80లక్షలతో పర్యాటక శాఖ నుంచి డబుల్‌డెక్కర్ ఏసీ బోట్ కొనుగోలు చేశారు. అంతా సిద్ధమై ప్రారంభమవుతుందనే క్రమంలో భారీ వర్షాలతో పడవ కొట్టుకుపోయి తుమ్మపొదల్లోకి చేరింది. దానికి మరమ్మతు చేసి నదిలోకి తీసుకువచ్చేందుకు జాప్యం జరుగుతోంది.

కలిసిరాని పర్యాటకుల బోట్

రెండేళ్ల క్రితం సమ్మక్క- సారలమ్మ జాతర సమీపంలో గోదావరినదిలో ఏసీ బోట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. పూణే నుంచి వచ్చిన నిపుణులు డబుల్‌డెక్కర్ ఏసీ బోట్‌కు ఇన్‌స్టాలేషన్ చేశారు. అంతా పూర్తయి ఇక నదిలోకి ప్రవేశించే సమయంలో ఏసీకి సంబంధించిన కాపర్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రెండు నెలలు జాప్యం జరిగింది. తర్వాత బాలారిష్టాలు సవరించుకుని తిరిగి నదిలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యే క్రమంలో భారీ వర్షాలు పడ్డాయి.

పర్యాటకానికి అనుకూలంగా నది తీరం

జిల్లాలోనే అతిపెద్ద పట్టణంగా ఉన్న గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి సమీపంలో ఉన్న నది తీరం పర్యాటక క్షేత్రంగా విరాజిల్లేందుకు అన్ని వసతులున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, ఎన్టీపీసీ పవర్‌ప్లాంట్, ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు గోదావరి బ్రిడ్జికి కొద్ది దూరంలో సుందిళ్లబ్యారేజీ సందర్శన స్థలం ఉంది. తీరం వెంట ఇరువైపులా వంద ఫీట్ల రహదారి ఏర్పాటు చేసి పచ్చని చెట్లు, పచ్చిక బయళ్లతో మరో కోనసీమగా మార్చే అవకాశాలు బోలెడు ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పర్యాటకానికి జాప్యం జరుగుతోంది. ఈప్రాంతానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారనే ఆలోచనతో గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలో హరిత హోటల్ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. హోటల్ నిర్మాణం ప్రతిపాదనల దశలోనే ఉంది.

నిలిచిన రెగెట్టా పోటీలు

గోదావరిపై సుందిళ్ల బ్యారేజీ ఏర్పాటుతో నది ఏడాది పొడవునా నీటితో నిండుకుండలా మారింది. ఏటా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లో నిర్వహిస్తున్న మాదిరిగా ఇక్కడ రెగట్టా పోటీలు ఒక్కసారి విజయవంతంగా నిర్వహించారు. పోటీల ఈవిషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి ఎమ్మెల్యే చందర్ తీసుకెళ్లడంతో గోదావరితీరాన్ని మరింత పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో రెండు బోట్లు, ఫ్లోటింగ్ ప్లాంట్ ఫాం, రూ.80లక్షలతో పెద్ద పడవ తెప్పించారు.

సింగరేణి పర్యాటకంతో పెరగనున్న సందడి



ఇటీవల సింగరేణిగని దర్శించడానికి వచ్చిన పర్యాటకులు

ఆర్టీసీ చేపట్టిన సింగరేణి సందర్శన్‌తో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ఇటీవల భారీగా పర్యాటకులు ఆర్టీసీ ప్యాకేజీ ద్వారా వచ్చారు. ప్రతివారం ఒకటిలేదా రెండు బస్సుల్లో హైదరాబాద్ నుంచి వస్తున్నారు. ఈక్రమంలో గోదావరినదిపై బోట్ టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేస్తే మరింత సందడి పెరగనుంది.

త్వరలో మరమ్మతు చేస్తాం

భారీ వర్షాలకు కొట్టుకుపోయి తుమ్మల్లో చేరిన బోట్‌ను బయటకు తీసుకవచ్చేందుకు నిర్ణయం తీసుకున్నాం. బోట్ తయారు చేసిన కాంట్రాక్టు ద్వారా విడిభాగాలుగా విడదీసి సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం. ఇన్‌స్టాలేషన్ చేసిన అనంతరం నదిలోకి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాం. అయితే మళ్లీ వరదలు వచ్చినా బోట్ సురక్షితంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నాం. బోట్ సేఫ్టీ కోసం అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని పంపించి స్టడీ చేస్తున్నాం. – మనోహర్‌రావు, రాష్ట్ర టూరిజం ఎండీ

హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే

జ్యోతినగర్(రామగుండం): కోర్టు ధిక్కార కేసులో ఎన్టీపీసీ చైర్‌పర్సన్‌కు రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలంటూ ఎన్టీపీసీ చీఫ్ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, జేబీ పార్థివాలాతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. నాన్–ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన ధిక్కార కేసులో 2022 డిసెంబర్ 31న ఎన్టీపీసీ చైర్‌పర్సన్‌కు రెండు నెలల జైలుశిక్ష విధించిన సందర్భంలో స్టే విధించినట్లు సమాచారం.

ఇద్దరిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణ పనుల్లో బోరు, పైప్‌లైను ధ్వంసం చేసిన తండ్రీకొడుకులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం.. కోనాపూర్‌కు చెందిన తుమ్మల నర్సవ్వ అదే గ్రామానికి చెందిన రాజిరెడ్డి నుంచి భూమి కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించింది. కాగా సదరు భూమి విషయంలో రాజిరెడ్డి అతడి తమ్ముడు రాజేశం మధ్య వివాదం కొనసాగుతుంది. వివాదం కొనసాగుతుండగానే భూమిని ఎలా కొనుగోలు చేశావని నర్సవ్వ ఇంటి నిర్మాణం చేస్తున్న ప్రదేశానికి వెళ్లిన రాజేశం అతడి కుమారుడు లక్ష్మణ్ బోరు, పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేశం, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో గల రామేశ్వరాలయంలో వాచ్‌మెన్‌పై దాడి చేసి చోరీకి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ నటేశ్ వివరాల ప్రకారం.. గత నెల 25న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలానికి చెందిన రౌతు పవన్(20) రామేశ్వరాలయంలోకి ప్రవేశించి వాచ్‌మెన్ గాజుల సత్తయ్యను ఐరన్ రాడ్‌తో గాయపరిచి హుండీలోని డబ్బు ఎత్తుకెళ్లాడు. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం గీతాభవన్ చౌరస్తాలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పవన్‌పై గతంలో ఒక మర్డర్ కేసు కూడా ఉంది. అతడి నుంచి రూ.2,500, ఐరన్‌రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిపోయిన వ్యాపారిని పట్టుకున్న బాధితులు..?

జగిత్యాలక్రైం: అప్పు పేరిట పలువురి నుంచి రూ.10 కోట్ల నుంచి రూ.22 కోట్ల వరకు వసూలు చేసి కుటుంబంతో సహా పారిపోయిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన రేగొండ నరేశ్‌ను బాధితుడొకరు పట్టుకున్నట్లు సమాచారం. అప్పు తీసుకున్న వ్యాపారి 2021 సెప్టెంబర్ చివరి వారంలో పరారైన విషయం తెల్సిందే. పోచమ్మవాడకు చెందిన పిట్టల రజిత 2 అక్టోబర్ 2021న జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ సింధూశర్మ రెండు ప్రత్యేక బృందాలతో బెంగళూరు, హైదరాబాద్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో బాధితులంతా ఆందోళనకు గురయ్యారు. తాజాగా శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో రేగొండ నరేశ్‌ను సారంగాపూర్ మండలానికి చెందిన బాధితుడు పట్టుకున్నట్లు సమాచారం. పట్టుకున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై పట్టణ సీఐ కిశోర్‌ను వివరణ కోరగా.. తాము పట్టుకోలేదని, సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోలపై ఆరా తీస్తున్నామని వెల్లడించారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మహ్మద్ జావిద్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కొట్టడంతో శనివారం విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌పై పోలీస్‌స్టేషన్‌లో, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా విద్యార్థి చదవకపోవడంతో మందలించానని తెలిపారు.

యువతి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం మోరపల్లికి చెందిన 20ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. యువతి శనివారం ఉదయం చల్‌గల్ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లింది. కానీ ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన దుంపల రాజిరెడ్డికి చెందిన విద్యుత్ మోటార్‌ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పొరండ్లకు చెందిన దుంపల రాజిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద శనివారం ఉదయం విద్యుత్ మోటార్ పెట్టేందుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలుషిత నీటితోనే విద్యార్థులకు అస్వస్థత

- రాజన్నసిరిసిల్ల జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- పాఠశాలలో నీటి పరిశీలన
- నీటిని ల్యాబ్‌కు పంపిన భగీరథ అధికారులు



పాఠశాలను పరిశీలిస్తున్న రాధాకిషన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలుషితమైన నీటితో మధ్యాహ్న భోజనం వండి పెట్టడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. గొల్లపల్లిలోని పాఠశాల పరిసరాలు, నీటి సరఫరా చేస్తున్న సంపు నుంచి సేకరించిన నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ, భగీరథ నీటి సరఫరా రెండు రోజులుగా నిలిచిపోవడంతో ట్యాంకర్ ద్వారా తెచ్చిన నీటిని సంపులో నింపి.. వాటితోనే వంట చేయడం ద్వారా విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నామన్నారు. నీటిని పరీక్షలకు పంపగా, ల్యాబ్ నుంచి నివేదిక రాగానే దాని ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన ఆకుకూరలతో భోజనాన్ని వండి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.

చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఉన్నారని, పాఠశాలల్లో మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈవో రాధాకిషన్‌కు ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం సరోజన, బాల్‌రెడ్డి, నాయకులు దేవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



మడ్డి రాములు (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): అప్పుల బాధతో కౌలు రైతు మడ్డి రాములుగౌడ్(47) ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామానికి చెందిన రాములుగౌడ్ కౌలు రైతుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కౌలు చేసిన వ్యవసాయంలో నష్టపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య అంబిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన యాదగిరి మధురమ్మ (75) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఎస్ఐ రాజేశ్ వివరాలు.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మధురమ్మ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముత్తారం(మంథని): మండలంలోని పోతారం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. జమ్మికుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన మోతే అంజి ఓసీపీ– 2లో వోల్వో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం డ్యూటీ అనంతరం ఇంటికి వెళుతున్న క్రమంలో పోతారం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడకు చేరుకొని బాధితుడిని అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కత్తితో యువకుడి వీరంగం

కథలాపూర్(వేములవాడ): మండలంలోని అంబారిపేట గ్రామంలో శనివారం సాయంత్రం ఓ యువకుడు కత్తితో వీరంగం సృష్టించాడు. గ్రామస్తుల కథనం.. మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం అంబారిపేట ప్రభుత్వ పాఠశాల వద్దకు బైక్‌పై స్పీడ్‌గా వచ్చాడు. ఓ ఉపాధ్యాయురాలు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌తో ఢీకొట్టేలా స్పీడ్‌గా వెళ్లడంతో అక్కడే ఉన్న తోటి ఉపాధ్యాయులు సదరు యువకుడిని మందలించారు. అనంతరం ఉపాధ్యాయురాలు, విద్యార్థులు వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. తర్వాత యువకుడు బైక్‌పై ఆర్టీసీ బస్సును వెంబడించాడు. బస్సు ఎక్కి కత్తితో అటూఇటూ తిరుగుతూ హల్‌చల్ చేశాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. యువకుడి తీరుతో విసిగిపోయిన కొందరు ప్రయాణికులు వారించడంతో బస్సు దిగాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై రామచంద్రం అక్కడకు చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా కల్లు తాగిన మత్తులో ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు.


ప్రైవేటు క్లీనిక్ సీజ్



సీజ్ చేయిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని జనతా ప్రైవేటు క్లీనిక్‌ను శనివారం సీజ్ చేసినట్లు డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన చింతల బ్రహ్మంకు ఆర్‌ఎంపీ అస్లాం వైద్యం చేయగా వికటించింది. న్యాయం చేయాలని బాధితుడు సంబంధిత ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లగా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధితుడు బ్రహ్మం ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు క్లీనిక్‌ను సీజ్ చేసినట్లు డెప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌చంద్ర, డెమో అధికారి తులసి నారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, రాంకుమార్ ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రామగుండం: ఇంధన డిపోల సమీపంలో ముందు వెళుతున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొనగా కారులో ఉన్నవారు తృటిలో ప్రాణపాయం నుంచి బయటపడ్డారు. బాధితుల వివరాలు.. శనివారం రాత్రి కారులో హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తున్న క్రమంలో ఐటీసీ ఔట్‌లెట్ వద్ద కారు వెనుక వస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ వేగంగా ఢీకొనగా.. కారు అదే వేగంతో ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు, వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో గోదావరిఖనికి చెందిన వైఎస్సార్‌టీపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంపై అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఏలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ నవజాత శిశువు మృతి

- డాక్టర్ నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన

కరీంనగర్‌టౌన్: నగరంలోని కశ్మీర్‌గడ్డకు చెందిన ఇమ్రాన్– సన దంపతుల నవజాత శిశువు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. నాలుగు రోజుల క్రితం జన్మించిన శిశువుకు ఆరోగ్యం బాగా లేక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుకగల ఓ పిల్లల వైద్యుడి వద్దకు శనివారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. గంట పాటు చికిత్స అందించిన సదరు పిల్లల వైద్యుడు పరిస్థితి విషమించడంతో చొప్పదండి రోడ్‌లోని మరో ఆసుపత్రికి పంపించాడు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు మరణించాడు. అయితే మొదట ట్రీట్‌మెంట్ చేసిన వైద్యుడి నిర్లక్ష్యం వల్లే శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట కుటుంబీకులు, బంధువులు ధర్నా నిర్వహించారు. డాక్టర్‌పై భౌతికదాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై సదరు వైద్యుడిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

అప్రమత్తంగా ఉండాలి



వివరాలు తెలుసుకుంటున్న సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): అసంక్రమిత బీపీ, షుగర్, క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. బీపీ, షుగర్, క్యాన్సర్‌తో బాధపడుతున్నవారికి వైద్యం అందిస్తున్న తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 40 ఏళ్ల పైబడిన వారు వైద్యుల సలహా మేరకు రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజారోగ్యం వివరాలు సేకరించాలని చెప్పారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్, సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శరణావన్

రాయికల్(జగిత్యాల): అటవీ పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరణావన్ హెచ్చరించారు. శనివారం చింతలూరు గ్రామంలోని అటవీ క్షేత్రాన్ని పరిశీలించారు. క్యాంప పథకం కింద అటవీశాఖలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు నిఘా పెంచాలని అన్నారు. గ్రామాల్లో కలప లభిస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనం సభాస్థలి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరిలో ఆదివారం మానకొండూర్ నియోజకవర్గ స్థాయి టీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించే సభాస్థలి ఏర్పాట్లను మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరిశీలించి మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మానకొండూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ నాయకులు హాజరవుతున్నారన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధంవేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ పర్శరాం, వెంకటనర్సింహారెడ్డి,రవీందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

వడ్డీ డబ్బులు ఇవ్వాలి



మాట్లాడుతున్న జువ్వాజి విమల

సిరిసిల్లటౌన్: మహిళా పొదుపు సంఘాలకు ఏళ్ల తరబడిన రావాల్సిన వడ్డీ డబ్బులను ప్రభుత్వం చెల్లించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల కోరారు. శనివారం సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రెస్‌మీట్లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పొదుపు సంఘాలకు వడ్డీ డబ్బులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ విషయమై పలుమార్లువిన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వడ్డీ డబ్బులు విడుదల చేయాలని లేనిపక్షంలో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ సత్తవ్వ, పుష్పలత, వజ్రవ్వ, నర్సవ్వ, జడల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: ముస్తాబాద్, రామలక్ష్మణపల్లెలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాలకు శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్‌లు సుమతి, రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ..మంత్రి కేటీఆర్ చొరవతో బాధిత కుటుంబాలకు చెక్కులు అందించామన్నారు. ఉపసర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, రాజు, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్వర్, జానబాయి, బాలయ్య, సంతోష్‌రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ఎల్లారెడ్డిపేట: గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, పాఠశాల మరమ్మతుకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తామని ఉపసర్పంచ్ ఒగ్గు రజిత అన్నారు. కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ పాఠశాలను, గ్రామంలోని విద్యుత్ లైన్ సమస్యను పరిశీలించారు. పెచ్చులుడుతున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల వివరాలను అధికారులకు అందిస్తానన్నారు. ఎల్లారెడ్డిపేటలో 12,13 వార్డుల్లో ఇళ్ల పైనుంచి వెళ్తున్న వైర్లను విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి సరిచేయిస్తానన్నారు. నాయకులు ఒగ్గు బాల్‌రాజ్, ఉపాధ్యాయులు, నాయకులువెంట ఉన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో వైద్యశిబిరం

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి స్నేహ ఆధ్వర్యంలో శనివారం పలు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. పీహెచ్‌సీ పరిధిలోని మండెపల్లి, రగుడు, రాజీవ్‌నగర్, సర్దాపూర్ గ్రామాల్లో నాలుగు వైద్యబృందాలు క్యాంపులు నిర్వహించినట్లు వైద్యాధికారి స్నేహ తెలిపారు. నర్సులు శ్రావణి, మమత, గంగాదేవి, సంతోష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సరఫరా



ముస్తాబాద్: ఎట్టకేలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా చేసింది. 'సాక్షి'లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నవంబర్ 29న 'అందని ఆరోగ్యలక్ష్మి' ఈనెల 5న 'మూడు నెలలుగా పాలులేవ్.. అంగన్‌వాడీల్లో గర్భిణీలు, పిల్లలకు నిలిచిన పాల సరఫరా' శీర్షికన ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు, పాల సరఫరా చేపట్టారు. దీనిపై స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సమీక్షించి పాల సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు శనివారం వ్యాన్‌లలో పాల డబ్బాలను సరఫరా చేశారు. కేంద్రాలకు పాలు రావడంతో గర్భిణులు, పిల్లలకు పాలను సరఫరాచేశారు. చిన్నారులతల్లిదండ్రులు, గర్భిణులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పతంగుల కేరింతలు..

- గగన వీధుల్లో 'తోక'చుక్కలు..
- సిరిసిల్లలో పతంగుల విక్రయాలు జోరు
- ఆకట్టుకుంటున్న వెరైటీ పతంగులు
- పట్టణంలో మొదలైన పతంగుల ఆటలు





సిరిసిల్లలో అమ్ముతున్న వెరైటీ పతంగులు

సిరిసిల్లటౌన్: గగన వీధుల్లో విహరించే పతంగుల కేరింతలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సంక్రాంతి మాసంలో గాలిపటాలు ఎగిరేసి ప్రజలు కాలక్షేపం చేస్తున్నారు. పైరగాలులు మొదలైన పక్షం రోజులుగా సిరిసిల్లలో రంగురంగుల పతంగులు షికార్లు కొడుతున్నాయి. పేపరు, వెదురు పుల్లలతో తయారయ్యే పతంగులు ఇప్పుడు వెరైటీగా ముస్తాబై ముచ్చటగొలుపుతున్నాయి. వేలాది డిజైన్లలో మార్కెట్‌ను ముంచెత్తగా...జిల్లా కేంద్రం సిరిసిల్లలో పతంగులు రంగురంగుల పతంగులు సందడి చేస్తున్నాయి.

పతంగుల సందడి..

సంక్రాంతి మాసం పతంగుల ఆటలతో సిరిసిల్ల జిల్లాకేంద్రం సందడి..సందడిగా మారింది. లేబర్ అడ్డా, అంబేద్కర్‌నగర్, వెంకంపేట, బీవైనగర్, గాంధీనగర్, పెద్దబజారు, పాతబస్టాండ్, గాంధీ చౌక్, కొత్తబస్టాండ్, మార్కెట్ ఏరియా, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో పతంగుల దుకాణాల్లో కస్టమర్లు కొనుగోలు చేస్తుండడంతో సందడి నెలకొంది. కాన్పూర్, అహ్మదాబాద్, కలకత్తా, మలేషియాల్లో తయారయ్యే పతంగులను స్థానిక వ్యాపారులు వాటి డిమాండ్‌కు తగ్గట్టుగా తెప్పిస్తున్నారు. లోకల్‌గా తయారు చేసే చిరువ్యాపారులు సైతం ఆధునిక డిజైన్లలో పతంగులను కస్టమర్లను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేలాది వెరైటీల్లో పతంగులు మార్కెట్‌ను ముంచెత్తాయి.

సండే స్పెషల్

అదుర్స్..కైట్స్..

ఆకాశంలో కేరింతలు కొట్టే కైట్స్ అదుర్స్ అనిపిస్తున్నాయి. వేలాది రకాల్లో గాలిపటాలు పిల్లలు మొదలుకుని పెద్దల వరకు ఆకట్టుకుంటున్నాయి. వీటిలో తోకపతంగి, ఫిష్‌కైట్, రంగీలా, జరీ, బట్ట, సిల్వర్, గోల్డ్, లాంథర్, ఈగల్, డేగ, ట్రియాంగిల్, డ్రాగన్, కార్టూన్ లవర్స్, లవ్‌బర్డ్స్, బట్టర్‌ఫ్లై, సాధారణ పతంగులు సిరిసిల్లలో దొరు కుతున్నాయి. చిన్న, పెద్ద, సాధారణ సైజుల్లో వీటిని తయారు చేసి విక్రయిస్తున్నారు. పతంగులు ఎగర వేయడానికి దారాలు, దానిని చుట్టేందుకు అందమైన చెరకాలు ప్లాస్టిక్, కర్రలతో చేసినవి లభిస్తున్నాయి. కాటన్ దారాలు, మాంజా దారాలు కూడా వెరైటీల్లో అమ్ముతున్నారు.

ఆకాశంలో రయ్ రయ్..

రంగు రంగులతో తయారు చేసే పతంగులు ఆకాశంలో రయ్ రయ్ మంటూ ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. గాలికి అటు..ఇటు తిరుగుతూ.. కనువిందు చేస్తున్నాయి. పట్టపగలే ఆకాశంలో అందమైన చుక్కలు పొడుచుకున్నాయా అన్నట్లుగా సిరిసిల్ల గగన వీధులు కాంతులీనుతున్నాయి. సాధారణ కాగితం, వెదురు పుల్లలతో చేసినవే కాకుండా క్లాత్, ప్లాస్టిక్ పేపర్లు, సిల్వర్, గోల్డ్ రంగురంగుల పతంగులు, లాంథర్ పతంగుల అమ్మకాలు జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతున్నాయి. మార్కెట్‌ను ముంచెత్తిన పతంగులతో దుకాణాలు, వీధులు కళకళలాడుతున్నాయి. వేలాది డిజైన్లలో దొరుకుతున్న పతంగులు పట్టణ వాసులను ముచ్చట గొలుపుతున్నాయి. దాబాలు ఎక్కి, మైదానాల్లోకి వెళ్లి పిల్లలు పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొడుతున్నారు. ఒకరికొకరు పోటీలు పెట్టుకుంటూ..గాలిలో పతంగులను షికార్లు కొట్టిస్తూ..ఆనందం పొందుతున్నారు.



ఆనందంగా ఉంటుంది



సంక్రాంతి పండుగ అంటే పతంగుల ఆటలతో సంబరాల్లో మునిగి తేలుతాం. చిన్నప్పటి నుంచి గాలిపటాలు ఎగురవేయడం ఆ ఆనందమే వేరు. మాటల్లో చెప్పలేనిది. గతంలో కన్నా..సిరిసిల్లలో ఇప్పుడు వెరైటీ డిజైన్లలో పతంగులు అమ్ముతున్నారు. పిల్లలు పతంగులు ఎగురవేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలి.

రామోజుల శ్రీనివాస్, సిరిసిల్ల

కైట్స్ అంటే ఇష్టం..



ఆకాశంలోకి కైట్స్ ఎగురవేయడం భలే సరదాగా ఉంటుంది. వాకిట్లో ముగ్గులు, ఆకాశంలో గాలిపటాలతో కలర్‌ఫుల్‌గా ఉంటుంది. దీనిని నేను చాలా ఎంజాయ్ చేస్తాను. బొమ్మలు, పక్షుల రూపాల్లో గాలిపటాలు అందంగా ఉన్నాయి. ధరలు కూడా తక్కువే. సిరిసిల్లలో వివిధ డిజైన్లలో కైట్స్ క్రేజీగా ఉన్నాయి.

తట్ల వర్ష, విద్యార్థిని, సిరిసిల్ల

రూ.5 నుంచి రూ.300

పట్టణంలో రూ. 5 మొదలుకుని రూ. 200 విలువైన పతంగులు అమ్ముతున్నారు. హోల్‌సేల్ అండ్ రిటేల్ ధరలకు విక్రయిస్తున్నారు. దారాలు రూ. 2నుంచి రూ. 40, కాటన్ దారాలు(మాంజాలు) రూ. 5 నుంచి రూ. 40, దారం చెరకలు రూ. 30 నుంచి రూ. 80, బట్టపతంగి రూ.60 నుంచి రూ.300, లాంథర్ రూ.30 నుంచి రూ. 50, డ్రాగన్ రూ.300, డేగ రూ.150, బటర్‌ఫ్లై రూ.150, ట్రి యాంగిల్ రూ. 60 నుంచి రూ.300, సాధారణ పతంగులు రూ. 2 నుంచి రూ.50 ధరల్లో లభ్యమవుతున్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వైద్యం అందించాలి

- విద్యార్థులకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధుల పరామర్శ
- పాఠశాలలో సంపు, భోజనం పరిశీలన

సిరిసిల్లఅర్బన్: కలుషిత ఆహారం తిని అస్వస్థకు గురైన విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ అన్నారు. అస్వస్థకు గురైన రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆసుపత్రిలో పరామర్శించారు. పాఠశాలలో కలుషిత ఆహారం తిని 30 మంది విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధకరమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఇలాంటిఘటనలు పునరావృతం కాకుండా చుడాలన్నారు. నాయకులు రుద్రవేణి రంజిత్, కొమ్మట సౌమ్య, అక్షిత,హృదేష్, నిరోష్ ఉన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం, నీళ్లు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురికాగా జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో కిచెన్ షెడ్డును, మంచి నీటి సంపును పరిశీలించారు. మరోసారి ఇలాంటి ఘటలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి, ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాన్నారు. సర్పంచ్ సరోజన, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీపీ రేణుక, నాయకులు సుభాష్, జబ్బార్, నర్సింహారెడ్డి, దేవారెడ్డి, మల్లేశం, మురళీమోహన్ తదితరులు ఉన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ, సెస్ డైరెక్టర్



సంపును పరిశీలిస్తున్న నాయకులు

విద్యార్థుకు పరామర్శ

సిరిసిల్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి వైద్యులను కోరారు. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందుతుందని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులు మురళీధర్‌ను పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పిల్లల పరిస్థితి బాగుందన్నారు. పరామార్శించిన వారిలో నాయకులు అప్సర ఉన్నీసా, కిషన్, నర్సింహులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏబీవీపీ మండల కన్వీనర్ ధరంసోత్ రాకేశ్‌నాయక్ అన్నారు. ముస్తాబాద్ జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిసరాలు కలుషితంగా ఉన్నాయని, వంటలకు సరైన నీటివసతి లేదన్నారు. విద్యార్థులకు తాగునీరందించాలన్నారు. కిచెన్‌షెడ్డులో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సన్నరకం బియ్యం సరఫరా చేయాలన్నారు. సాయి, కిశోర్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

మంత్రి సహకారంతో వాటర్‌ప్లాంట్

చందుర్తి: మంత్రి కేటీఆర్ సహకారంతో చందుర్తి కేజీబీవీ పాఠశాలలో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌ను శనివారం ఏర్పాటుచేశారు. గ్రామంలోని వాటర్ ప్లాంట్ నుంచి క్యాన్‌లలో ఆటోద్వారా కేజీబీవీ పాఠశాలకు నీటిని తెప్పించుకోవడం కష్టంగా ఉందని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో యుద్ధ ప్రతిపాదికన వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేశారు. దీంతో విద్యార్థిను లు టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాటర్‌ప్లాంట్ తో ఏర్పాటుతో ఇబ్బందులు తప్పాయని పాఠశాల ప్రత్యేకాధికారి కల్పన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, మర్తనపేట గ్రామాల్లో రాత్రిళ్లు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రా క్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. కనగర్తి మూలవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామ శివారులో, మరో ట్రాక్టర్‌ను మర్తనపేట గ్రామశివారులో పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ కొత్తకొండ ప్రశాంత్, యజమాని కలకుంట్ల శ్రీనివాస్‌పై కేసునమోదు చేశామన్నారు.

కూలీరేట్లు నిర్ణయించాలి

సిరిసిల్లఅర్బన్: వస్త్రోత్పత్తికి సంబంధించి ఆసాములకు, కార్మికులకు కూలీరేట్లు నిర్ణయించాలని చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. శనివారం కార్మిక భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆసాములకు, కార్మికులకు కూలీ నిర్ణయించకపోవడం సరికాదని, టెస్కో అధికారులు సిరిసిల్లో పర్యటించి కూలీ విషయమై చర్చించలేదన్నారు. చాలీచాలనీ కూలీరేట్లతో కాలం వెల్లదీస్తున్నారని, టెస్కో అధికారులు యజమాన్యాలు, ఆసాములు, కార్మికులతో చర్చించి కూలీరేట్లు పెంచేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసాముల సంఘం అధ్యక్షుడు వెంకటేశం, వెంగల అశోక్, మణ, శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకులు అజ్జవేణు, రమేశ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

వేములవాడఅర్బన్: మండలంలోని రుద్రవరం గ్రామ రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు 90శాతం సబ్సిడీ అందిస్తోందన్నారు. డ్రిఫ్ట్ ఇరిగేషన్‌కు సబ్సిడీ అందిస్తోందన్నారు. పెట్టుబడి సాయం కూడా అందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ పంటలు సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉరడి రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, ఏఈవో అనుషా, ఆరవింద్, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మ్యాకల మల్లేశం శనివారం పేర్కొన్నారు. ఐదేళ్లుగా డిగ్రీ కళాశాల కోసం ఆందో ళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నా రు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పందించి మండలకేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

ఎల్లారెడ్డిపేట: వాహనదారురు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని సీఐ మొగిలి అన్నారు. శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులతో పాఠశాల నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ, ఫ్లకార్డులు, ప్రదర్శించి వాహనదారులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

- ఆంగ్లంపై నైపుణ్యం పెంపొందించుకోవాలి
- స్పెల్‌బిజార్డ్, స్టోరీ టెల్లింగ్‌లో పోటీలు
- రెండు విభాగాల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఈవో



స్కిల్‌టెస్టు ప్రశ్నపత్రాలు ఆవిష్కరిస్తున్న టీచర్లు



మాట్లాడుతున్న ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్/వీర్నపల్లి/గంభీరావుపేట/తంగళ్లపల్లి/ముస్తాబాద్: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల వ్యాప్తంగా శనివారం కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు జిల్లా, మండలాల స్థాయి ప్రతిభాపోటీలు నిర్వహించారు. రాతపరీక్షలు, స్టోరీ టెల్లింగ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు.

కేజీబీవీ విద్యార్థులకు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని పద్మానగర్ కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలలో శనివారం దారుల్ ఖైర్‌వెల్ఫేర్ సొసైటీ సిరిసిల్ల ఆధ్వర్యంలో.. వెక్టర్ అకాడమీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీస్కిల్స్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దారుల్ ఖైర్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇంకాసార్(బాబా) మాట్లాడుతూ మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు కేజీబీవీ పద్మానగర్‌లో, 2 నుంచి 3 గంటల వరకు తంగళ్లపల్లి పాఠశాలలో క్లాసులు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీపీ పడిగెల మానస మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి ప్రత్యేకశిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా దారుల్ ఖైర్ నిర్వాహకులను అభినందించారు. సర్పంచ్ పోచయ్య, తంగళ్లపల్లి ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఏ.శ్యామల, విక్టర్, పద్మనాభం, హమీద్, జగన్, శ్రీనివాస్, హెచ్‌ఎం గోవర్ధన్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ..

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక..



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడఅర్బన్: మండలంలోని అగ్రహారం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఇటీవల 5,6 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలను డా.బీఆర్. అంబేద్కర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించగా అగ్రహారం కళాశాల విద్యార్థులు ఖోఖో పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అజయ్ అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. కళాశాల విద్యార్థినులు వాలీబాల్‌పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. చెస్‌పోటీల్లో అభిరామ్, అశ్రిత రన్నరప్‌గా నిలిచారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్, టీచర్లు అభినందించారు.

18 నుంచి 'కంటివెలుగు'

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'కంటివెలుగు' కార్యక్రమం జిల్లాకేంద్రం సిరిసిల్లలో ఈనెల 18నుంచి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. కంటివెలుగు కార్యక్రమం నిర్వహణకు శనివారం ప్రత్యేక కౌన్సిల్‌సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలతో వందరోజుల కంటివెలుగు కార్యక్రమం ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. పట్టణంలోని 39 వార్డుల్లో నిర్వహించే కార్యక్రమానికి కౌన్సిలర్లు విధిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమాన్ని జిల్లా ఆరోగ్యశాఖ సమన్వయంతో చేపడుతున్నామన్నారు కౌన్సిల్‌పరంగా నిర్వహించే కార్యక్రమాలు, విధివిధానాలపై కౌన్సిలర్లతో చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ వెల్దండి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- కోనరావుపేటలో కల్యాణలక్ష్మి చెక్కులు, ట్రైసైకిళ్ల పంపిణీ



చెక్కులు అందిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట మండలకేంద్రంలో 70 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను, 78 మంది వికలాంగులకు బ్యాటరీ సైకిళ్లు, ట్రైసైకిళ్లు, వినికిడి మిషన్లు, పంపిణీ చేశారు. సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమానికి కృషిచేస్తున్నారన్నారు. కోనరావుపేట మండలంలో ఇప్పటివరకు 1500 మంది లబ్ధిదారులకు రూ.13.18 కోట్లు అందించామన్నారు.చంద్రయ్య, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో రామకృష్ణ, సీడీపీవో ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రి సేవలు వినియోగించుకోవాలి

పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్పీచైర్‌పర్సన్ అరుణ అన్నారు. ఎంపీపీ చంద్రయ్య అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రిలో 57 రకాల పరీక్షలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లలేని ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. తహసీల్దార్ నరేందర్, వైద్యాధికారి వేణుమాధవ్, సర్పంచులు రేఖ,కేతిరెడ్డి అరుణ, వైస్‌ఎంపీపీ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

మామిడిపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 21న రెండు రోజులు జరిగే మాఘ మాస జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. మామిడిపల్లి ఆలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నివసతులు కల్పించాలన్నారు. ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, పోలీస్‌బందోబస్తు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. రూ.2.70 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించాలని, రూ.50 వేలతో ఆవరణలో మొరం పోయించాలన్నారు.